# ఆదిలోనే హంసపాదు

ఆ వీధిలో వున్న చాలామందికి మల్లే రమణ దంపతులక్కూడా తమ అబ్బాయిని ఇంగ్లీషు మీడియం స్కూల్లో చేర్పించాలన్న వుబలాటం రేకెత్తింది. అది ఈనాటిది కాదు. వాళ్ళబ్బాయి పుట్టినప్పట్నుంచీ ఈ కోరిక వారి మనసుల్లో స్థిరనివాసం యేర్పరుచుకుంది.

ఎంత మనం ఇంగ్లీషు వద్దు మొర్రో అంటున్నా ఇంగ్లీషు మీడియమ్ స్కూళ్ళు రోజురోజుకీ పెరుగుతున్నాయేగాని, తరగడం లేదు. అందుకు కీలకమైన కారణం యేమీలేకపోయినా, కేవలం తమ పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడాలన్న కోరిక. వారి నడవడికలో స్థిరత్వం, క్రమపద్ధతి యేర్పడు తుందన్న విశ్వాసం తలిదండ్రులలో పెరిగిపోవడమే. అందులో కొంత నిజమూ లేకపోలేదు.

రమణ భార్య రమకి పక్కింటి పిల్లలు వాళ్ళమ్మని 'మమ్మీ' అని పిలుస్తూ వుంటే ఎంతో ముచ్చటగా ఉంటోంది. తననీ తన కొడుకు అలా సంబోధిస్తుంటే ఎంత ఆనందంగా వుంటుంది అన్న ఆరాటం ఆమెని గిలిగింతలు పెట్టింది.

"ఏఁవండీ! మనబ్బాయిని కాన్వెంటులో చేర్చాలనుకున్నాం కదా! ఏమైనా ప్రయత్నాలు చేస్తున్నారా?" అని అడిగిందో రోజు, భర్త రమణని.

"వాడు పుట్టిందగ్గర్నించీ మనం అనుకుంటున్నదేగా ఈ విషయం. అందుకే ఈ మధ్యనే ఓ అప్లికేషను పెట్టాను" అన్నాడు రమణ.

"అయితే సీటు దొరికిపోవచ్చునంటారా?" ఆసక్తిగా అడిందిరమ.

"అదెట్లా చెప్పగలం అప్పుడే? హెడ్‌మిస్ట్రెస్ మాత్రం గ్యారెంటీగా సీటు దొరుకుతుందని చెప్పలేనంటోంది."

రమ నీరసంగా మొహం పెట్టింది.

"అదేవిఁటండీ? మన అబ్బాయిని చేర్చడానికి ప్రయత్నించినపుడే ఈ పరిస్థితి రావాలా?" దిగాలుగా అందామె.

"ఈ పరిస్థితి ఎందుకు రాదు చెప్పు? ఇప్పుడు చాలా మంది ఈ ఇంగ్లీషు మీడియమ్ స్కూళ్ళకి ఎగబడుతున్నారు.

"అప్లికేషను పెట్టుకున్న ప్రతి వ్యక్తికీ సీటివ్వడం సాధ్యమా?"

"మరేం చేస్తారట....?"

"ఏదో పరీక్ష పెడతారు. అందులో మనబ్బాయి ఉత్తీర్ణుడైతే సీటిస్తారు."

"అలాగయితే ఫరవాలేదు. మీరు వాణ్ణి బాగా తర్ఫీదు చెయ్యాలండీ. ఎలాగయినా మనవాడికి సీటు దొరకాలి."

"ప్రయత్నిద్దాంలే!" తాపీగా అన్నాడు రమణ.

రమ నీరసంగానే నిట్టూర్చింది. భర్త మాటలు అంత ఆశాజనకంగా అనిపించలేదామెకి. అయితే, పూర్తిగా ఆశని వదులుకోదల్చుకోలేదు.

*　　　*　　　*

తీరా పరీక్ష ఎప్పుడు పెడతారోనని వాకబు చెయ్యాలని స్కూలుకి వెళ్ళిన రమణ పిడుగులాంటి వార్త విన్నాడు. అదేమిటంటే, పిల్లలకు పరీక్ష పెట్టరని. తలిదండ్రులు చదువుకున్నవాళ్ళయి వుండాలని, వాళ్ళకే యింటర్వ్యూ లాంటిదేదో వుంటుందని.

రమణకి కళ్ళు తిరిగినట్టయింది. ఈ నిర్ణయం తమకి బొత్తిగా అనుకూలమైనది కాదని అతనికి తెలుసు. ఎందుకూ అంటే, తన భార్య రమ ఎనిమిదో క్లాసు వరకూ చదివి, స్కూలుకి గుడ్‌బై కొట్టిన వ్యక్తి. అంచేత ఆమెకి ఇంగ్లీషు మాట్లాడ్డంలో ఎంత పరిజ్ఞానం వుందో అతనికి బాగా తెలుసు. అందుకే నిరాశతో, గుండె బరువుతో తెల్లమొహం వేస్తూ యింటికొచ్చాడు.

భర్త అదోలా వుండడాన్ని గమనించింది రమ. ఆయన యెందుకలా వున్నారో ఆమెకీ అంతు చిక్కలేదు.

"అలా వున్నారేమండీ?" ప్రశ్నించింది కంగారుపడుతూ.

రమణ నిస్పృహతో ఓ నిట్టూర్పు విడిచాడు.

"అబ్బాయిని స్కూల్లో చేర్పించే విషయంలో మనం వూహించిందంతా తారుమారయింది రమా!" దిగాలుగా అన్నాడు కుర్చీలో కూలబడుతూ.

అబ్బాయిని యింకా స్కూల్లో చేర్పించకముందే అవరోధాలు ఎదురవుతున్నందుకు హతాశురాలయింది రమ.

"ఏమయ్యిందండీ?" దిగాలుపడుతూ అంది.

"వచ్చిన దరఖాస్తులు చాలా వున్నాయట. అందుచేత అడ్మిషను కావాలనుకున్న పిల్లలకు పరీక్ష ఎలాగో వుంటుంది. దాంతోపాటు పిల్లల తలిదండ్రులకు ఇంగ్లీషు పరిజ్ఞానం యేపాటుందో చూసి మరీ పిల్లలకు సీటిస్తారట. ఈ సంవత్సరం నుంచి యిదో కొత్త తరహా పద్ధతి ప్రవేశపెట్టారట" చాలా నిరుత్సాహంగా అన్నాడు రమణ.

రమ భర్తకంటె రెండింతలు దిగులు పడింది. ఆమె మొహంలో రంగు మారింది. నిజం చెప్పాలంటే కొడుకుని కాన్వెంటులో చేర్చడానికి ఆమె పట్టుదలే అధికం. "అయితే, ఇప్పుడెలాగండీ మరి? నేనేం అంతగా చదువుకున్నదాన్ని కాను. మనిద్దరం వెళ్తే, వాళ్ళేవో ఇంగ్లీషులో అడిగారనుకోండి, నేనేం చెప్పగల్ను? నలుగురిలో అభాసు తప్పించి, ఇంకేమైనా వుంటుందా?" అంతులేని నిరుత్సాహంతో అందామె.

రమణకి యిదో పెద్ద సమస్యగానే తోచింది. తనతోపాటు రమని తీసుకెళ్తే తప్పకుండా అవమానపడాల్సి వస్తుందనిపించిం దతనికి.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను రమా!" సాలోచనగా అన్నాడు.

రమ ఏం మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తోంది. రమణ కూడా తీవ్రంగా ఆలోచించసాగేడు — ఏం చేస్తే బావుంటుందా అని.

రమణ మెదడులో తటుక్కున ఓ ఆలోచన మెరిసింది.

"ఓ అయిడియా వచ్చిందోయ్ రమా!" వుత్సుకతతో అన్నాడు.

"ఏవిఁటండీ అది?" రమలోనూ ఆసక్తి యినుమడించింది.

"మా ఆఫీసులో ఓ లేడీ టైపిస్టుంది. ఆమె సహాయాన్ని అర్థిస్తే సరి...."

"అంటే? ఆమె యే విధంగా సహాయం చేస్తుందంటారు?" అర్థం గాక అమాయకంగా అడిగింది రమ.

రమణ చిన్నగా మందహాసం చేశాడు. "నీకు బొత్తిగా ప్రపంచ జ్ఞానం లేదు రమా! ఇంగ్లీషులో మాట్లాడగలిగే ఓ స్త్రీ, ఇంటర్వ్యూ జరిగే కొద్ది సేపటికోసమైనా నాకు భార్యగా వ్యవహరించాలి కదా! అందుకే అంటున్నాను.... యీ కొద్దిపాటి సహాయాన్ని మా టైపిస్టు నుంచి తీసుకో వచ్చునని."

రమ మొహం వెల వెల బోయింది. ఆమె హృదయ స్పందన జోరు హెచ్చింది. ఆ కొద్ది క్షణాలయినా తన భర్త సరసన, యెవరో మరో స్త్రీ భార్యనంటూ నిల్చోవడం, ఆమెకి సుతరామూ యిష్టం లేక పోయింది. అంతే గాకుండా, ఈ అవకాశాన్ని కావాలని వినియోగించు కోవాలని భర్త చూస్తున్నాడేమోనన్న చిన్న అనుమానంకూడా యేర్పడింది. ఆమె కళ్ళల్లో చిన్న యెర్రదనం చోటు చేసుకుంది.

"ఏవిఁటండీ మీరంటున్నది? ఎవరో ఆ టైపిస్టుని తీసుకెళ్ళి, మీకు భార్యగా వాళ్ళందరికీ పరిచయం చేస్తారా? నాకు ప్రపంచ జ్ఞానం లేదంటున్నారుగాని, అసలు ఆ జ్ఞానం మీకుందండీ!" చిరు కోపంతో అంది.

రమణ బిత్తరపోయాడు. భార్యకేసి అదోలా చూశాడు. ఆమె మొహంలో, కళ్ళల్లో, చిరుకోపం తారాడుతూ వుంటే, కొంపదీసి తుఫాను ప్రారంభమవుతుందేమోనని భయమేసింది.

"నాకు జ్ఞానం లేదంటున్నావు సరే—వొప్పుకున్నాను రమా! కాని,

యిప్పుడీ సమస్య పరిష్కారమయ్యేదెలా? అయితే, మనబ్బాయిని కాన్వెంటులో చేర్చడం మాట మర్చిపో." గంభీరంగా అనేశాడు రమణ.

రమ మొహం వాడిపోయింది. ఒక పక్క అబ్బాయి కాన్వెంటు చదువు, మరో పక్క యెవరో పరాయి స్త్రీని తన స్థానంలో నిలబెట్టడం రెండూ ప్రముఖ సమస్యలై పోటీ పడ్డాయి. ఏం చెయ్యాలో ఆమెకి అర్థం కాలేదు. తమ అబ్బాయిని చేర్పించినపుడే ఈ కొత్త రూల్సేవో రావాలా? తానేదో కనీసం మెట్రిక్ పాసయ్యున్నా బావుండిపోను అప్పట్లో.... అదీ లేకపోయింది, ఎనిమిదో క్లాసుతోనే ఆపేయాల్సి వచ్చింది. అప్పటి పరిస్థితులు వేరు. పోనీ, ప్రస్తుతానికి తమ అవసరం కోసం, ప్రస్తుత సమస్య పరిష్కారం కోసం ఆ లేడీ టైపిస్టునే తాత్కాలికంగా ఉపయోగించుకుంటేనో ...." ఈ కాస్త పరిచయం క్రమంగా ఎంత దూరం పోతుందో అన్న స్త్రీ సహజమైన అనుమానం ఆమె మెదడులో మెదిలింది. దాంతో ఏవేవో మనసులో వూహించుకుంది. అవన్నీ అప్రయత్నంగా వూహాలోకంలో మెదిలేసరికి, ఆమెకికళ్ళు తిరిగినట్టయ్యాయి. మరింక ఆలోచించ లేకపోయింది. ఒక నిర్ణయాని కొచ్చింది.

"పోన్లెండి. అబ్బాయికి కాన్వెంటు చదువే వుండక్కరలేదు. ఏదో ఒక స్కూల్లో చేర్పించండి. అందరిపిల్లలూ కాన్వెంటు స్కూల్లోనే చదువుతున్నారా ఏవిఁటి? ఎందుకొచ్చిన పాట్లండీ యివన్నీను? ఉన్న అవకాశాలతో తృప్తి పడదాం" అంటూ తన నిర్ణయాన్ని వ్యక్తం చేసింది రమ.

రమణ విస్తుపోయాడు. నిరుత్సాహం అతని నవ నాడుల్లో ప్రవహించింది. అబ్బాయిని కాన్వెంటులో చేర్చి, వాడి భవిష్యత్తుకి పటిష్టమైన పునాది వెయ్యాలనే తన ఆకాంక్ష యిలా ఆదిలోనే అడుగంటబోతున్నందుకు మానసికంగా మథనపడ్డాడు.

"అదేవిఁటి రమా? ఒక్కసారి నీ అభిలాషను, అభిప్రాయాన్నీ బలవంతంగా చంపుకుంటున్నావా?" బాధగా అన్నాడు రమణ.

రమ బరువుగా ఓ నిట్టూర్పు విడిచింది.

"మరేం చెయ్యమంటారండీ? పరిస్థితులు మనకి ప్రతికూలంగా వుంటే, వాటిని యెదుర్కొనేకంటె వాటితో రాజీ పడ్డమే శ్రేయస్కరం కదూ?"

"పరిస్థితులు ప్రతికూలంగా వున్నాయని యెలా అనుకుంటున్నావు?"

"మరేం అనుకోమంటారు? ఎవతెనో ఓ పరాయి స్త్రీని తీసుకొచ్చి మీ భార్యగా పరిచయం చేసుకోవాల్సిన దుస్థితి యేర్పడుతోందంటే అనుకూల పరిస్థితికి నిదర్శనమనుకోమంటారా?" సూటిగా ప్రశ్నించింది.

భార్య అంతరంగం అవగతమయింది రమణకి.

"దీన్ని ఓ దుస్థితిగా పేర్కొనడం బావులేదేమో ఆలోచించు రమా! మన అవసరానికి ఆమెని వినియోగించుకుంటున్నా మంతే. అదీ కొన్ని నిముషాలు మాత్రమే. నువ్వు బాగా యోచించు. మన అబ్బాయి కాన్వెంటు చదువుకోసమైనా, వాడి భవిష్యత్తుకోసమైనా మనం ఈ కాస్తంత సర్దుబాటు చేసుకోవాలి." అన్నాడు నచ్చజెప్పే ధోరణిలో.

రమ మళ్ళీ తార్కికంగా ఆలోచించింది. "ఆ కొద్ది నిముషాలూ అయితే యిబ్బంది లేదండీ! కాని, ఈ అవకాశాన్ని అదనుగా పెట్టుకొని, ఆమెతో పరిచయాన్ని పెంచుకునే అవకాశం వుంటేనో?" తన మనసులో మొలకెత్తిన అనుమాన బీజాన్ని బైటపెట్టింది.

రమణకి నవ్వొచ్చిందామె తెలివితక్కువ ఆలోచనకి. గట్టిగానే నవ్వేశాడు.

"ఎందుకా నవ్వు?" మొహం ముడుచుకుంటూ అంది రమ.

"నవ్వు గాక యింకేవిఁటి? నీ తెలివితక్కువ ఆలోచనకి నవ్వాలో, జాలిపడాలో అర్థం కాకుండావుంది రమా. స్త్రీ సహజమైన బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. ఒక్క విషయం ఆలోచించు. ఆమెతో పరిచయాన్ని పెంచుకోవాలంటే యిటువంటి అవకాశమే అందుబాటులోకి రావాలా చెప్పు? ఆమె పని చేస్తున్నది యింకెక్కడో కాదు. మా ఆఫీసులోనే. అయితే అటువంటి భావనలే మాలో వుండవు. ఒకవేళ వుంటే నువ్వేవీఁ చెయ్యలేవు. మమ్మల్ని చూడలేవు కూడా. మనుషుల్లో నిజాయితీ, నీతి వుండాలి గాని, అడుగడుక్కీ యిటువంటి అనుమానాలు పెట్టుకోకూడదు. అది ఆరోగ్యానికి మంచిది కాదు. నా ప్రవర్తన తెలిసి కూడా నీలో యిటువంటి

దురాలోచన పుద్భవించిందంటే నాకే సిగ్గుగావుంది" మెల్లగా మందలిస్తూ అన్నాడు రమణ.

రమ చిన్నబుచ్చుకుంది తన అనుమానానికి. ఆయనన్నట్టు అటు వంటి అభిప్రాయమే వుంటే, ఇలాంటి అవకాశమే వుండాలా?.... ఛీ! ఛీ! తనకెందు కొచ్చిందో ఈ అనుమానం . అవమానంతో సిగ్గు పడిపోయింది.

"క్షమించండి! మీరన్నట్టు నీతి, నిజాయితీ వుండాలి. సర్లెండి. ఈ సంఘటన మర్చిపోకండి. ఆమె సహకారాన్ని అడగండి. ఇలాగయినా, అబ్బాయికి కాన్వెంటులో సీటు దొరికితే ఆనందమే కదా?" అంది రమ.

"నీలో మొలకెత్తిన అనుమానం అడుగంటినట్టేనా?" నవ్వుతూ పరిహాస ధోరణిలో అడిగాడు.

"అబ్బ! పోదురూ! ఏదో ఆ పాడు అనుమానం వచ్చేసిందోసారి. ఈ సంఘటనే మర్చిపొమ్మన్నానా మరి! ఇహ ఆ ప్రయత్నమేదో చెయ్యండి."

"ఇంక ఆవిణ్ణి అడగనీ! ఆమె నాతోపాటు అక్కడికి రావడానికి అంగీకరిస్తుందో లేదో?" కాస్తంత బెట్టు చూపించాడు.

"అంగీకరించేట్టే చూడండి...."

"ప్రయత్నిస్తాలే...."

ఆ రోజుకి ఆ ప్రస్తావన అక్కడితో ముగిసింది.

*            *            *

మరుసటి రోజు ఆఫీసు నుంచి తిరిగొచ్చిన రమణకి చిరునవ్వుతో ఎదురయింది రమ.

"ఏవిటి రమా, ఇవాళ ఎంతో హుషారుగా అగుపిస్తున్నావు? ఏవిటి విశేషం?" లోపలికొస్తూనే అడిగాడు రమణ.

"ప్రత్యేకంగా విశేషం ఏఁవీ లేదండీ? మీరు రేపు కాన్వెంటుకి వెళ్తున్నట్టేగా?"

రమణ కుర్చీలో కూచుని బూటు విప్పుకుంటూ భారంగా ఓ నిట్టూర్పు విడిచాడు.

"లేదు రమా! పరిస్థితి అనుకూలించలేదు."

"మళ్ళీ ఏమయిందండీ?" గతుక్కుమంది రమ. ఆమె మొహం వివర్ణమైంది.

"మా ట్రైపిస్టు ఒప్పుకోలేదు."

"ఎందు కొప్పుకోలేదూ?"

"ఆమెకున్న సమస్యలు ఆమెవి. నాతోపాటు వస్తే, లేనిపోని వ్యాఖ్యానాలు, అపనిందలు తలెత్తుతాయని ఆమె భయం. అనుమానాలు మనకే కాదు అందరికీ వుంటాయి" నవ్వుతూనే అన్నా దెబ్బకొట్టాడు.

రమ లోలోన చిన్నబుచ్చుకుంది.

"అయితే మరేం చేద్దాం?"

"ఏం లేదు. లక్షణంగా మనబ్బాయిని తెలుగు స్కూల్లో చేర్పించేస్తే పోతుంది. ఇంగ్లీషు చదువుకో దండం పెట్టేసి వూరుకుంటే సరి!"

"అంతేనంటారా?"

"అంతకంటే మరో మార్గం అగుపించడం లేదు రమా! నాకు భార్యగా వ్యవహరించమని ఇంకెవర్ని దేభిరించి అడుగుతాం చెప్పు? అందుకే, ఆ ప్రయత్నమే మానుకుందాం."

"నాకూ అలాగే అనిపిస్తోందండీ! ఏం ఇంగ్లీషు చదువు లెద్దురూ! సలక్షణంగా మన మాతృభాష నేర్పించుకుంటే పోలా! రేపే జాయిన్ చేయించండి."

"తొందర పడొద్దు. ఇప్పుడు మనబ్బాయికి వయస్సు చాలదు. కాన్వెంటులో అయితే నర్సరీ వుంటుంది కాబట్టి యిబ్బంది లేదు. అంచేత అబ్బాయిని యింటి దగ్గర తర్ఫీదు చేసి, వచ్చే సంవత్సరం చేర్పించాల్సిందే."

"వచ్చే సంవత్సరమే అయితే, కాన్వెంటులోనే మళ్ళీ ప్రయత్నిస్తే కాదుటండీ?" రమకింకా ఆసక్తి తగ్గలేనట్టుంది.

రమణ ఆశ్చర్యంగా ఆమెకేసి చూశాడు. "అదిగో మళ్ళీ ఆ బలహీనతకి లోనవుతున్నావు రమా! ఆ ఆలోచనన్ని నీ మనసులోంచి పీకిపారెయ్" అన్నాడు.

"అలాగే లెండి. మరి, ఆ తలంపు రానివ్వను." దృఢ నిశ్చయంతో అంది రమ.

"హమ్మయ్య! ఇప్పుడు నా మనసెంతో ప్రశాంతంగా వుంది. అబ్బబ్బ ఎన్ని ప్రయత్నాలు చేశాం? ఎంత మందిని బ్రతిమిలాడాం? ఛీ! ఛీ! ఆ చదువు లొద్దంటే వద్దు, నాకొ్కంచెం స్ట్రాంగ్ కాఫీ తీసుకురా!"

రమ లోపలికి వెళ్ళింది.

రమణ ఏదో రిలీఫ్ వచ్చినట్టుగా తృప్తిగా నిశ్వాసం విడిచి, కుర్చీలో వెనక్కి చేరబడ్డాడు.

* ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 24-9-1982 *